క్లుప్తంగా

స్వామివారి విగ్రహాలకు కవచాలు అందజేత



తెనాలిటౌన్: పట్టణ షరాఫ్‌బజార్‌లోని శ్రీ సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహాలకు కవచాలను పట్టణానికి చెందిన ముద్దుల రామమోహనరావు, విజయలక్ష్మి దంపతులు అందజేశారు. ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి వెండి కవచాలను స్వామివారికి అలంకరించారు. ఒక కిలో వంద గ్రాముల తూకంతో తయారు చేయించినట్లు దాత రామమోహనరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, ఆలయ వంశ పర్యఅర్చకులు ఆర్.శ్రీనివాసమూర్తి, కిరణ్‌కుమార్, సురేష్, భక్తులు పాల్గొన్నారు.

బెస్ట్ లయన్స్ అవార్డు అందుకున్న కాకరపర్తి



తెనాలిఅర్బన్: బెస్ట్ లయన్స్ అవార్డును తెనాలికి చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రమణ్యంకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మధరావు, జిల్లా గవర్నర్ కె.విజయ్‌చంద్‌లు అందజేశారు. గుంటూరులోని బిబిఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి ఈ కార్యక్రమం జరిగినట్లు సుబ్రమణ్యం తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సుభాష్‌బాబు, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ఫీజులు తగ్గించేలా చూడాలి



తెనాలిఅర్బన్: మెడికల్ కళాశాలల ఫీజులను తగ్గించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు కొల్లిపర బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన జీఓ నంబర్ 107, 108 లను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ తెనాలి డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.ఉదయ్ ఈశ్వర్‌కూచిపూడి సుభాష్, నాయకులు ఎన్.వినయ్, రవీంద్ర, సతీష్, కళ్యాణ్, సురేష్, సందీప్, చిన్న పాల్గొన్నారు.

మాజీ భర్తపై గృహ హింస కేసు నమోదు

వేమూరు: వివాహ బంధం కలిసిరాక.. మూడు పెళ్లిళ్ల అనంతరం మొదటి భర్త వద్దకు చేరిన భార్య అతనిపై సోమవారం గృహహింస కేసు పెట్టింది. స్థానిక ఎస్ఐ నాగరాజు వివరాల మేరకు.. మండలంలోని జంపని గ్రామానికి చెందిన శివకుమారి, రాజేష్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఇద్దరూ పదేళ్లు కాపురం చేశారు. ఈ క్రమంలో మనస్పర్థలు వచ్చి వారు విడాకులు తీసుకున్నారు. దీంతో శివకుమారి, శ్రీను అనే వ్యక్తిని రెండో పెళ్లి చేసుకుంది. అయితే రోడ్డు ప్రమాదంలో శ్రీను మృతి చెందడంతో.. శాంతి స్వరూప్ అనే వ్యక్తిని శివకుమారి మూడో పెళ్లి చేసుకుంది. అతను మరొక మహిళతో అక్రమ సంబంధం పెట్టుకొని ఆమెతో వెళ్లిపోయాడు. దీంతో శివకుమారికి దిక్కుతోచక మొదటి భర్త రాజేష్ వద్దకు చేరుకుంది. ఇద్దరం కాపురం చేసుకుందమని అతనితో రాజీ పడింది. ఇద్దరూ కాపురం చేసుకుంటున్నారు. అయితే తనపై అనుమానంతో హింసకు గురిచేస్తున్నాడని, రోజూ కొడుతున్నాడని వేమూరు పోలీసుస్టేషన్‌లో మొదటి, మాజీ భర్త రాజేష్‌పై శివకుమారి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు.. విచారించి గృహహింస చట్టం కింద రాజేష్‌పై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

జీవీఆర్ఎస్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పించటం లక్ష్యంగా తమ కళాశాల కృషి చేస్తోందని జీవీఆర్ఎస్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కరిమున్నీసా అన్నారు. సోమవారం బుడంపాడు గ్రామంలోని కళాశాలలో టాగ్ టెక్నాలజీస్, డైకిన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు ప్రాంగణ ఎంపికలు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 26 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వీరిని కళాశాల చైర్మన్ డాక్టర్ ఎన్.సిందూర, డాక్టర్ చైతన్య, కళాశాల డీన్ డాక్టర్ బి.వరప్రసాద్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రమేష్‌బాబు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కుశల్‌కుమార్, ప్రశాంత్ హెచ్ఆర్ శివకోటయ్య ఆచారి అభినందించారు.

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే శివకుమార్



లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ, వారి సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామ సచివాలయయాలు , వలంటీర్ వ్యవస్థ ద్వారా గడప గడపకు అందుతున్నాయని ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. సోమవారం కొల్లిపర గ్రామంలో సచివాలయం 3 పరిధిలో కొత్తబొమ్మువాని పాలెం మండలంలోని గడప గడపకూ మన ప్రభుత్వం ముగింపు కార్యక్రమంలో భాగంగా రామాలయం వద్ద నుంచి జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని 250 ఇళ్లను సందర్శించారు. ముందుగా ఎమ్మెల్యేకు వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటి వద్దకు వెళ్లిన సమయంలో ఆకుటుంబం మూడేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే వివరించి సంక్షేమ కరపత్రాలు అందజేశారు. ప్రభుత్వం గ్రామంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ కొల్లిపర మండలంలో 15 గ్రామ సచివాలయాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం ఒక సంవత్సరం నాలుగు నెలలు సమయం పట్టిందన్నారు. వైఎస్సార్ సీపీ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలో సీఎం జగనన్న సంక్షేమం కోసం సుమారు రూ.2 లక్షల కోట్ల నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.

కొల్లిపర మండల పరిధిలో....

కొల్లిపర మండలంలో సంక్షేమం కోసం రూ. 244 కోట్ల ఇచ్చినట్లు తెలిపారు. ఇలా గత ప్రభుత్వాలల్లో ఏముఖ్య మంత్రి అయిన సంక్షేమం అందించారా అని ప్రశ్నించారు. త్వరలోనే ప్రతి గ్రామంలో పూర్తిగా దెబ్బ తిన్న రోడ్లు మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. అవసరమైన చోట నూతన సీసీ రోడ్డు నిర్మిస్తామని తెలిపారు.కొల్లిపర గ్రామంలో రోగులకు వైద్య సదుపాయం మెరుగుగా చేయటానికి 30 పడల హాస్పటల్‌ను 8 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నాడు-నేడు ద్వారా ప్రతి పాఠశాలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కొల్లిపర నుంచి చివలూరు గ్రామానికి వేళ్లే బీటీ రోడ్డును రూ.3.28లక్షలతో నిర్మాణం, కొల్లిపర గ్రామం శివారులో ఉన్న కరకట్ట వద్ద రేపల్లె కెనాల్ పై రూ.4.19కోట్లతో మూడునెలల్లో వంతెన నిర్మాణం ప్రారంభం చేస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో రైతులకు ఉపయోగ కరంగా ఉండాలని 5 ఎకరాలల్లో మినీ మార్కెట్ యార్డు నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇలా అన్ని గ్రామాల్లో అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తున్నట్లు వివరించారు.

బాబు, పవన్ కల్యాణ్‌లకు ప్రజలే బుద్ధి చెప్పాలి....

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయం, వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రజలందరికీ సుపరిపాలన అందజేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. నవరత్నాలు, అమ్మ ఒడి, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, నేతన్న నేస్తం వంటి పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలు, రైతులకు మేలు చేకూరిందన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక , ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, తెనాలి వ్యవసాయమార్కెట్‌యార్డు చైర్మన్ అవుతు సీత, నగేష్‌రెడ్డి, ఎంపీటీసీలు చిలువూరి ఝాన్సీ , కె.శ్రీలత , భీమవరపు చిన్న రామిరెడ్డి, లక్ష్మారెడ్డి ,ఎంపీడీఓ చంద్రమోహన్, తహసీల్దారు జి.నాంచారయ్య, వివిధ శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది ,వలంటీరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా యుద్ధనౌక గద్దర్ చిరంజీవి

సంతాప సభలో దిలీప్‌రాజా



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలి: సమసమాజం నిర్మాణం ఆశయంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో సాధించాల్సిన సాంస్కృతిక విప్లవం కోసం లక్షలాది ప్రజల గొంతుకై నిలిచిన ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు మరణం లేదని మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. ఇక్కడి సంస్థ కార్యాలయంలో సోమవారం గద్దర్ సంతాపసభను నిర్వహించారు. సినీనటుడు వేమూరి విజయభాస్కర్ (మీసాల భాస్కర్) అధ్యక్షత వహించారు. దిలీప్‌రాజా మాట్లాడుతూ, నోరులేని పేద ప్రజలు, విద్యార్థి, యువజన, రైతుకూలీ, ఉపాధ్యాయ, ఉద్యోగ ఉద్యమాల నిర్మాణం తాను ఎత్తిన గొంతును గద్దర్ జీవితమంతా దించనేలేదని గుర్తుచేశారు. ప్రజా ఉద్యమాలు, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు అంకితమైన ఎందరికో స్ఫూర్తినిచ్చారని చెబుతూ, గద్దర్ స్ఫూర్తితో వందలు, వేలాది గద్దరు దేశమంతా ఎదిగినట్టు సోదాహరణంగా చెప్పారు. చరిత్రను మలుపుతిప్పిన మహనీయులకు మరణం లేదని చెబుతూ, వారిలాగే విప్లవ సాంస్కృతిక యుగకర్త గద్దర్ కూడా చిరంజీవిగా చెప్పారు. గద్దర్ జీవిత విశేషాలను విజయభాస్కర్ వివరించారు. ఆయనతో తెనాలికి గల అనుబంధాన్ని స్మరించుకున్నారు. వీరితో నటుడు అమీర్‌చౌదరి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

స్పందన సమావేశంలో ఆరు అర్జీలు



అర్జీదారుడి సమస్యపై మాట్లాడుతున్న ఏఓ వెంకటస్వామి

తెనాలి: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన సమావేశానికి ఆరు అర్జీలు వచ్చాయి. డివిజను పరిధిలోని వివిధ ప్రాంతాల్నుంచి వచ్చిన ప్రజలు ఇచ్చిన అర్జీలను కార్యాలయ పరిపాలన అధికారి బి.వెంకటస్వామి స్వీకరించారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి రెండు, మున్సిపాలిటీకి చెందిన సమస్య ఒకటి, జలవనరుల విభాగానికి ప్రత్యేకించినది మరొకటి, పోలీస్, ఆర్‌అండ్‌బీ విభాగానికి చెందినవి ఒక్కో అర్జీ వచ్చాయని చెప్పారు. అర్జీలను ఆయా విభాగాలకు పంపి, నిర్ణీత వ్యవధిలో పరిష్కారమయేలా చూస్తామని చెప్పారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో మండల తహసీల్దార్ కె.రవిబాబు అర్జీలను స్వీకరించారు. ఇక్కడ కూడా ఆరు అర్జీలు వచ్చాయని తెలిపారు.

నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- చేనేతలకు నాలుగేళ్లలో రూ.3,706 కోట్ల సంక్షేమం
- దేశంలో మరే రాష్ట్రంలోనూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వ సాయం
- జాతీయ చేనేత దినోత్సవంలో ఎమ్మెల్యే శివకుమార్



చేనేత కార్మికులను సత్కరించిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: రాష్ట్రంలో సొంత మగ్గం ఉన్న చేనేతలకు ఏటా రూ.24 వేల ఆర్థికసాయంతో సహా నవరత్నాలు కింద రూ.3,706 కోట్ల సంక్షేమాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక షరాఫ్ బజారులోని ది తెనాలి చేనేత సహకార సంఘంలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం చైర్‌పర్సన్ దామర్ల విజయరాణి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేనేత రంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు దేశంలో మరే రాష్ట్రంలోనూ లేవన్నారు. నేతన్న నేస్తం కింద రూ.970 కోట్లతో సహా గత నాలుగేళ్లలో మొత్తం రూ.3,706 కోట్ల సంక్షేమాన్ని చేనేతలకు అందించినట్టు చెప్పారు. చేనేత క్లస్టర్ల ఏర్పాటుతో ఆధునిత పద్ధతులతో చేనేతకు అవసరమైన శిక్షణనిప్పించి మరింతగా రాణించేలా దోహదపడేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నట్టు చెప్పారు. ఆయా కుటుంబాలను నిలబెట్టి, వారి పిల్లల చదువుకు, ఆరోగ్య పరిరక్షణకు విద్యాలయాలు, ఆసుపత్రులను ఆధునీకరిస్తున్నామని చెప్పారు. అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందిస్తున్నామని వివరించారు. ల్యాబ్ పరీక్షలు, నాణ్యమైన మందులను ఉచితంగా ఇస్తున్నట్టు చెప్పారు. చేనేత కేంద్రంలోని స్టాకు నిల్వల కొనుగోలుకు సంబంధిత మంత్రిని సంప్రదిస్తానని హామీనిచ్చారు. చైర్‌పర్సన్ దామర్ల విజయరాణి మాట్లాడుతూ, డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి చేనేతలకు 50 ఏళ్లకే పింఛను పథకాన్ని ప్రవేశపెడితే, జగన్‌మోహన్‌రెడ్డి మరింత ముందడుగు వేసి చేనేతల సంక్షేమానికి ఎంతగానో కృషిచేస్తున్నారని చెప్పారు. కొడాలి క్రాంతి మాట్లాడుతూ చేనేతలకు వెన్నెముకగా నిలిచింది వైసీపీ ప్రభుత్వమేనని చెప్పారు. గత ప్రభుత్వం వర్షాలకు మగ్గాల్లో నీరు చేరినపుడు పది కిలోల బియ్యం మాత్రమే ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆప్కోకు బకాయిలను కూడా విడుదల చేసిందన్నారు. జగ్గడిగుంటపాలెం జెడ్పీటీసీ కాజ భద్రావతి మాట్లాడుతూ ఇంతగా మేలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని 175 సీట్లలోనూ గెలిపించాలని కోరారు. చేనేత, అనుబంధ పనులు చేస్తున్న 70 మంది చేనేత కార్మికులను ఎమ్మెల్యే సత్కరించారు. సంఘ మేనేజరు తోకల సత్యనారాయణ, డోగుపర్తి రాజేష్, జొన్నాదుల గాంధీ, గోలి లక్ష్మీనారాయణ, సర్పంచ్ కంభం బాలాజీ, జకీరా, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

యడ్లపల్లి(వేమూరు): ముస్లిం పేద విద్యార్థులను ఆర్థికంగా ఆదుకోవడం జరుగుతుందని ఇమాం ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఖాశింఖాన్ పేర్కొన్నారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి గ్రామంలో ఇమాంఖాన్ చారిటబుల్ ట్రస్ట్ 16వ వార్షి కోత్సవం సందర్భంగా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేయడం జరిగిందన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు నగదు బహుమతి అందించడం జరిగిందని తెలిపారు. ఇతర నోటు పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. సర్పంచ్ షేక్ ముంతాజీ బేగం, చుండూరు మండల పరిషత్ కో-ఆప్షన్ మెంబరు అబ్దుల్ ఖాశిం పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. తెనాలి మండలం సంగం జాగర్లమూడి గ్రామ పరిధిలో నిమ్మతోటల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఆదివారం అర్ధరాత్రి దాటాక ఆకస్మిక దాడులు నిర్వహించారు. కుక్కలను కాపలా పెట్టి కోత ముక్కాడుతున్నారు. పోలీసుల రాకను గుర్తించిన జూదరులు పరారవగా ఒక వ్యక్తి పోలీసులకు చిక్కాడు. అక్కడ ఒక సెల్‌ఫోన్, బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన జూదరుల ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు ఎస్ఐ సోమవారం రాత్రి తెలిపారు.

చోరీ యత్నం కేసులో నిందితుల అరెస్ట్

తెనాలిరూరల్: ఆలయంలో చోరీకి యత్నించడమే కాకుండ అడ్డుకునేందుకు వచ్చిన పోలీసుల్లో ఓ కానిస్టేబుల్‌ను తీవ్రంగా గాయపర్చిన కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. తెనాలి వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని కేశ ఖండనశాలలోని ఓ బాక్సులో భద్రపరచిన తలనీలాలను అపహరించేందుకు ముగ్గురు దుండగులు నవీన్, సాయికుమార్, జీవనతేజ 4వ తేదీ అర్ధరాత్రి ఆలయప్రాంగణంలోకి ప్రవేశించడం, కేశఖండనశాలకు పైకప్పులో ఉన్న రేకులను తొలగించి తాడు సహాయంతో లోనికి దిగగా అక్కడ శబ్దాలు వస్తుండడం గమనించిన ఆలయ వాచ్‌మాన్ డయల్ 100కు ఫోన్ చేసి సమాచారమిచ్చిన సంగతి తెలిసిందే. ఘటనాస్థలానికి వెళ్లిన పోలీసు బృందంలోని కానిస్టేబుల్ వై. రమేష్ బాబును తోసివేయడంతో అతను రేకుల షెడ్డు మీద నుంచి పడి తీవ్రంగా గాయపడిన సంగతి విదితమే. ఈ కేసులో నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్టు వన్‌టౌన్ సీఐ ఎ. చంద్రశేఖర్ సోమవారం రాత్రి తెలిపారు.

నాలుగు గ్రామాల్లో ‘మిషన్ ఇంద్రధనస్సు’

ఫిరంగిపురం: మండలంలోని ఫిరంగిపురం 1,2,3తో పాటు పొనుగుపాడు, గుండాలపాడు, నుదురుపాడు గ్రామాల్లో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం సోమవారం నిర్వహించినట్లు నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఫరీనాబేగం అన్నారు. రెండో విడత మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం ప్రారంభించారని వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయాగ్రామాల్లో ఆరోగ్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇప్పటివరకు 0–5 ఏళ్లలోపు వ్యాక్సిన్ వేయించుకోని చిన్నారులు, గర్భిణులను గుర్తించి వారికి వ్యాక్సిన్ వేస్తారన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లి తిరిగివచ్చినవారు, కంపెనీల్లో, కోళ్లఫారాలలో పనుల కోసం వచ్చిన వారి పిల్లలు, గర్భిణులకు వ్యాక్సిన్ వేస్తారన్నారు. దాంతోపాటుగా వారి వివరాలను యూ విన్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపరిచి వారి ఫోన్ నెంబర్ సమాచారం అందజేస్తున్నట్లు తెలిపారు. దీనిద్వారా వారికి వ్యాక్సిన్ వేయించుకున్న సర్టిఫికెట్ తీసుకునేందుకు వీలవుతుందని చెప్పారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మహానగర్ అధ్యక్షుడు లయన్ ఎస్వీ గుప్త పాల్గొని మాట్లాడారు. అనంతరం పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం పి.బుజ్జి బాబు మాట్లాడుతూ కాకుమాను జోజప్ప ఆర్థిక సహకారంతో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా 200 పుస్తకాలు, 400 పెన్నులను అందించడం అభినందనీయమని అన్నారు. లయన్స్ ప్రతినిధులు కె. నాగేశ్వరరావు, సెక్రటరి ఉమా మహేశ్వరరావు, బెనర్జీ, పాఠశాల ఉపాధ్యాయులు డీవీ రమణమ్మ, కె.వెంకటేశ్వరరావు, ఎం.సుందరరావు, వి.సత్యనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో మట్టి పరీక్షలకు శ్రీకారం



కేంద్రీయ విద్యాలయంలో మట్టి నమూనా పరీక్షలు చేస్తున్న అధికారులు

తెనాలిటౌన్: రైతులకు విజ్ఞానం పెంపొందించేందుకు వ్యవసాయ క్షేత్రంలోని మట్టి నమూనాలను సేకరించి, కేంద్రీయ విద్యాలయలో పరిశీలించి వచ్చిన ఫలితాలను రైతులకు తెలియజేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వి.వి జయలక్ష్మి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించబోయే పాఠశాల ద్వారా మట్టి పరీక్ష కార్యక్రమాన్ని సోమవారం జగ్గడిగుంటపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో శ్రీకారం చుట్టారు. వ్యవసాయశాఖ, ఆత్మ విభాగం ద్వారా పైలట్ విధానంలో దేశంలో 10 రాష్ట్రాల్లో చేపడుతున్నట్లు విజయలక్ష్మి చెప్పారు. ఎనిమిది నుంచి ఇంటర్ వరకు కొద్ది మంది విద్యార్థులను ఎంపిక చేసి గ్రామాల్లోని పొలాల్లో మట్టిని సేకరించి కేంద్రీయ విద్యాలయలో మట్టి పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులతో కలిసి శాంపిల్స్‌గా కొన్ని నమూనాలను అధికారులు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రామాంజనేయులు, ఆత్మ డీడీఏ డాక్టర్ రత్నమంజుల, తెనాలి ఏడీఏ ఎస్.ఉషారాణి, ఏఓ జి.ప్రేమసాగర్, ఎస్‌టిఎల్ ఏఓలు సత్యనారాయణ, ఝాన్సీవాణిరెడ్డి, విద్యాలయ ఉపాధ్యాయులు వేణుగోపాలరావు, రాజేంద్రప్రసాద్, లాంఫామ్ శాస్త్రవేత్తలు డాక్టర్ గంగాదేవి, డాక్టర్ పద్మజ, విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ శ్రీకాంత్, వ్యవసాయ సహాయకులు నీలవేణి, పంజల్‌పేల్, హోగ్లా శుభోదయ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘన జీవామృతంతో అధిక దిగుబడులు



వరి సాగులో దేశవాలి మైసూర్ మల్లిక పంటలను పరిశీలిస్తున్న స్టేట్ ప్రకృతి వ్యవసాయ అధికారులు

వల్లభాపురం(కొల్లిపర): ఘనజీవామృతంతో వరి, ఇతర పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని స్టేట్ ప్రకృతి వ్యవసాయ సీనియర్ కన్సలెంట్ రామచంద్రం, రీజనల్ కోర్డినేటర్ వెంకటరావు అన్నారు. సోమవారం మండలంలోని వల్లభాపురం గ్రామంలోని ప్రకృతి వ్యవసాయంలో వరి సాగు చేస్తున్న దేశవాలి మైసూర్ మల్లిక రకం జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి రైతు ఎంతో కొంత ప్రకృతి వ్యవసాయం ద్వారా రకరకాల పంటలను పండించి ఆరోగ్య వంతమైన జీవితాన్ని జీవించాలని సూచించారు. ప్రతి రైతు ఖరీఫ్‌లో సాగు చేసే ముందు పొలంలో ఘనజీవామృతం వేయాలన్నారు. కార్యక్రమంలో డిపిఎం రాజకుమారి, ఏఓ వెంకటరావు, రైతులు కంభం పాటి కృష్ణ, దాసరి రత్న భాస్కర్, అవుతు పోతిరెడ్డి, కృష్ణ గురుమూర్తి, నాగ బసివిరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు మెరుగైన వైద్యసేవలు

జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్



కానిస్టేబుల్ రమేష్‌బాబు తండ్రితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నగరంపాలెం: గాయపడిన కానిస్టేబుల్ రమేష్ బాబు ఆరోగ్య పరిస్థితిపై గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆరా తీశారు. అనంతరం కానిస్టేబుల్ తండ్రి బసవయ్యతో మాట్లాడారు. తెనాలి వైకుంఠపురం దేవస్థానం ప్రాంగణంలో శనివారం దుండగులను పట్టుకునే ప్రయత్నంలో అత్యంత ధైర్యసాహసాల్ని ప్రదర్శించి, ఈ క్రమంలో గాయాలై గుంటూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో తెనాలి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ వై.రమేష్ బాబు చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. సోమవారం గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ ఆసుపత్రికి చేరుకుని, కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యుల్ని అడిగి తెలుసుకున్నారు. బాధితునికి మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు.

‘మానవత’కు నిజాయితీనే ఆభరణం

సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

తెనాలి: ప్రముఖ స్వచ్ఛంద సంస్థ మానవత తెనాలి శాఖ సభ్యత్వాన్ని పెంపుదల చేయాలని సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి సూచించారు. తెనాలి వచ్చిన సందర్భంగా సోమవారం స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో సంస్థ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. సంస్థ 98వ శాఖగా గత నెలలో మానవత తెనాలిలో ఆరంభమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రామచంద్రరెడ్డి మాట్లాడుతూ వీలైనంత ఎక్కువమంది సభ్యులు ఉండేలా చూడాలని చెప్పారు. సంస్థను నిజాయితీగా, నిబద్ధతతో నడపాలని చెబుతూ అందుకు అవసరమైన సూచనలు చేశారు. నిజాయితీనే సంస్థకు ఆభరణంగా చెప్పారు. తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, కో-చైర్మన్ డాక్టర్ డి.శారద, ఘట్టమనేని నాగేశ్వరరావు, తీన్నరు శ్రీనివాసబాబు, కళ్యాణి, మొవ్వా సత్యనారాయణ, సీహెచ్ సాంబశివరావు, వేదాంతం ఫణీంద్ర, యు.సత్యనారాయణ, ఓంకార్ ప్రసాద్, పి.వెంకటేశ్వరరావు, ఎస్‌వీఎస్ఎస్ శర్మ, బి.రాజీవ్, పావులూరు రమేష్, రామాంజనేయ రెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలోని జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు సోమవారం ఇంకుడుగుంతలు ఏర్పాటు చేయడం ద్వారా కలిగే లాభాలు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇంటిముందు ఇంకుడుగుంతను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. నాలుగు అడుగుల లోతు, అంతే విస్తీర్ణంలో ఉండేలా గుంతను తీసి దానిలో కంకర, ఇసుక, మట్టి పోయించాలన్నారు. దీనిద్వారా వర్షపునీరు ఇంకుడు గుంతల ద్వారా భూమిలో నిలిచి నీటి ఇక్కట్లు తొలగేందుకు సహాయకారిగా ఉంటుందని చెప్పారు. ఇంకుడు గుంతను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూ.6 వేలు నగదు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని చెప్పారు. ప్రభుత్వం ఇసుక, ఇనుము, సిమెంటు తక్కువ ధరకు అందజేస్తున్నట్లు తెలిపారు. కాలనీల్లో ఇప్పటికే నీటికి ఇబ్బంది లేకుండా బోర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పోటీతత్వంతో చదువుకోవాలి

బాపట్ల: విద్యార్థులు పోటీతత్వంతో చదువుకోవాలని ఎమ్మెల్యే కోన రఘుపతి సూచించారు. ప్రతిభావంతులైన బ్రాహ్మణ విద్యార్థులకు శ్రీభావపురి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక ఏవీవీ హైస్కూలులో సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. పోటీతత్వంతో ముందుకుపోవాలని తెలిపారు. పదో తరగతిలో 586మార్కులు సాధించిన అభిరామ్ కార్తీక్, ఇంటర్‌లో 973మార్కులు సాధించిన మాదిరాజు లక్ష్మీప్రవల్లికకు ప్రోత్సాహకాలను అందించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు నిభానుపూడి శ్రీహరి ప్రకాష్, సమాఖ్య కార్యదర్శి సోమరాజు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కొలను మోహన్, కోశాధికారి పూసపాటి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com